పైగా పుండు మీద కారం చల్లినట్లు.. ప్రస్తుత ముఖ్యమంత్రి ఈ నియోజకవర్గంలో ఇంకొక నాయకుడికి పూర్తిగా సపోర్టు చేస్తున్నాడు. వచ్చే ఎన్నికలలో టిక్కెట్టు అతనికే ఇవ్వటం ఖాయం. ఏ రకంగా చూసినా మరలా తనకు టిక్కెట్టు వచ్చే అవకాశాలు కనపడటం లేదు. ఇక మిగిలింది కనీసం ఖర్చు పెట్టిన డబ్బు వెనక్కి సంపాదించుకోవటం. అది ఎలాగా అన్న ఆలోచనలో అతను ఉండగా.. బాజీరావు వచ్చి అతన్ని కలిశాడు.

ఒకే గూటి పక్షులు కాబట్టి.. అరగంటలోనే మందు ముందు సెటిల్ అయ్యారు.

నెమ్మదిగా తన ప్లాను వివరించాడు బాజీరావు. వింటుంటే.. అన్నవరానికి తన తలకు ఎక్కుతున్న మత్తుమందు వలనో, బాజీరావు చెప్తున్న మాటలకో సరిగ్గా అర్థం కాలేదు.

“ఇదంతా సాధ్యమేనా? .. నీ వలన అవుతుందా? ..” అని మాత్రం అనగలిగాడు ఆ మత్తులో కళ్ళు మూసుకుపోతుంటే.

చిద్విలాసంగా నవ్వాడు బాజీరావు.

★ ★ ★

ఒకసారి తనకు పొలిటికల్ సపోర్ట్ ఉందని అర్థమయ్యాక అత్యంత వేగంగా పని ప్రారంభించాడు బాజీరావు.

దొంగలు దొంగతనం చెయ్యటం ఎంత కష్టమో, దానిని అమ్మి సొమ్ము చేసుకోవటమూ మరింత కష్టం. దొంగతనం చేసి తీసుకు వచ్చిన బంగారాన్ని కొనటానికి ఆ టౌన్‌లో ఇద్దరు ముగ్గురు వ్యాపారులు ఉన్నారు. వారు తాము తీసుకుంటున్న బంగారానికి ఇరవైశాతం కంటే ఎక్కువ ధర దొంగలకు ఇవ్వరు. అలా కొన్న బంగారాన్ని వెంటనే కరిగించి ప్యూర్‌గోల్డ్ కింద తయారు చేస్తారు.

అయితే ఈ వ్యాపారంలో కూడా రిస్కు ఉంటుంది. ఒకొక్కసారి దొంగతనం జరిగింది ఏ ప్రముఖుడి ఇంట్లోనో అయినప్పుడు.. పోలీసులకు దొంగలను పట్టుకోక తప్పని పరిస్థితులు ఏర్పడతాయి. అలాంటప్పుడు ఈ వ్యాపారులు తాము కొన్న దొంగవస్తువులను పోలీసులకు వెనక్కి ఇవ్వవలసి రావచ్చు.

అలాగే కొన్ని కొన్నిసార్లు ఏ వస్తువూ కొనకపోయినా పోలీసులను బయటపడేయటానికి వారికి కావలసినటువంటి నగలు చేయించి మరీ ఇవ్వవలసి రావచ్చు. ఇలాంటి అనుకోని ఖర్చులన్నీ పక్కన పెట్టినా.. ఈ వ్యాపారంలో లాభం లక్షల్లోనే ఉంటుంది.

అలాంటి వ్యాపారం చేసే వారిలో ప్రముఖుడు గులాబ్‌చంద్. అతని నాయకత్వంలో ఆ వ్యాపారులందరినీ ఏకం చేసి.. వారిలో వారికి పోటీ లేకుండా చేశాడు బాజీరావు. వారందరికీ తను చెయ్యబోతున్న పని గురించి వివరించి... దానితో వారి లాభాలు ఎన్ని రెట్లు ఎలా పెరుగుతాయో వివరించాడు. అలా అన్ని ఏర్పాట్లు చేశాక తన ఆఖరి పావు కదిపాడు బాజీరావు.

ఇంకా తెల్లవారటానికి మూడు గంటల సమయం ఉందనగా... రామకోటి ఉండే ఊరిలోకి ఒక పోలీసు జీపు, దాని వెనుక

రెండు లారీలు అనుసరిస్తుంటే ప్రవేశిం చింది.

చీకట్లో... వచ్చింది ఎవరో తెలిసేలోపే, ఊర్లోని మగవారిని అందరినీ ఎత్తి లారీల్లో కుదెయ్యటం మొదలుపెట్టారు.

ఆడవారి అరుపులూ, పిల్లల ఏడుపులతో పరిసరాలన్నీ ప్రతిధ్వనిస్తున్నాయి.

అక్కడ జరుగుతున్న అకృత్యాలు అడ్డు కోవటానికి ఏ రాజకీయ నాయకుడూ రాడు. ఏ విలేఖరికీ అవి అరాచకాలన్న స్పృహ రాదు. ఏ టీవీ ఛానలూ అలాంటి ఊరిలోకి ప్రవేశించదు. ఎందుకంటే- ప్రజ లందరికీ ఒక ప్రగాఢమయిన విశ్వాసం ఉంది- ఆ ఊర్లోని వారంతా దొంగలే అని!

తమ దగ్గర జరిగే దొంగతనాలన్నిటికీ ఆ ఊరి వారే బాధ్యులనీ... పోలీసులు వారిని చూసీ చూడనట్లు వదిలేస్తున్నా రనీ... వారి అభిప్రాయం!

అలాంటిది లేక లేక పోలీసులు వారి మీద చర్య తీసుకుంటుంటే- ఎవరైనా అడ్డు పడితే.. ప్రజల దృష్టిలో వారు విలన్లయ్యే ప్రమాదముంది. ప్రజాస్వామ్యంలో ప్రజ లకు నచ్చేదే న్యాయం కాబట్టి... ఇలాంటి విషయాలు కనీసం వెలుగులోకి కూడా వచ్చే అవకాశం లేదు.

జరుగుతున్న అలజడికి మెలకువ వచ్చిన పాండు కళ్ళు నులుముకుంటూ బయటికి వచ్చాడు.

అప్పటికే ఒక లారీ ఊర్లోని మగవారితో నిండిపోయి ఉంది. మిగిలిన వారిని రెండవ లారీలోకి ఎక్కిస్తున్నారు.

ఒక పోలీసు రామకోటిని బలవంతంగా లారీలోకి ఎక్కించే ప్రయత్నం చేస్తు న్నాడు.

"కనీసం మేము చేసిన నేరం ఏమిటో చెప్పండి సార్..." ప్రతిఘటిస్తూ అడుగు తున్నాడు అతను.



సమాధానం చెప్పటానికి అన్నట్లు జీపు దిగి వచ్చాడు బాజీరావు. సరాసరి రామ కోటి దగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

"ఎందుకో చెప్తేగానీ లారీ ఎక్కవా? .."

"అది కాదు సార్.." ఏదో చెప్పబోతున్న రామకోటి మూతి మీద లాఠీతో కొట్టిన దెబ్బకి రెండు మూడు పళ్ళు కదలిపో యాయి. పెదవి చిట్లి రక్తం కారటం మొదలయింది.

ఒక్కసారిగా పరిసరాలన్నీ నిశ్శబ్దమ య్యాయి.

ప్రతిఘటిస్తే జరిగేదేమిటో అందరికీ అర్థం అయింది. మరి మాట్లాడకుండా రామకోటి నడిచి వెళ్ళి లారీ ఎక్కాడు.

పాండు అడుగు ముందుకు పడబో యింది.

ఇంతలో కాంతం చెయ్యి అతని భుజం మీద గట్టిగా పడింది.

వెనక్కి తిరిగి చూశాడు.

వద్దన్నట్లు ఆమె తల అడ్డంగా ఊపింది.

మరో అయిదు నిమిషాల తరువాత నిండా మనుషుల్తో వాహనాలు ఆ ఊరి నుండి బయటకు నడిచాయి.

★ ★ ★

అలా బయలుదేరిన వాహనాలు పోలీసు స్టేషన్ దగ్గరకు వెళ్ళలేదు. ఊరికి దూరంగా ఉన్న పాడుపడిన గోడౌన్ ముందు ఆగాయి. అందులోని వారిని వరుసగా లోపలకు పంపి, గోడౌన్‌కి బయ టనుండి తాళాలు వేశారు.

ఆ తరువాత అక్కడ జరిగిన హింసా కాండ చూస్తే... హిట్లర్ కూడా సిగ్గుతో తల వంచుకోవాలి.

ఒక ప్రశ్న అడిగింది లేదు, సమాధానం ఆశించిందీ లేదు. అందరినీ పడేసి బాద టమే! అలా వారి స్థైర్యాన్నంతా దెబ్బతీశా మనుకున్నాక ప్రవేశించాడు బాజీరావు.

పోలీసులూ, మిలటరీ వారు కొత్త ఉద్యో గుల్ని రిక్రూట్ చేసుకున్నట్లు... తన



ప్రైవేటు సైన్యాన్ని భర్తీ చేసుకోవటం ప్రారంభించాడు.

ముందుగా వారు చెయ్యవలసిన పని వివరించాడు.

ఇక నుండి వారు ఎక్కడ దొంగతనం చెయ్యాలో అతను నిర్ణయిస్తాడు. దొంగతనం చేసిన సొమ్ము ఎవరికి అమ్మాలో అతనే నిర్ణయిస్తాడు. అమ్మిన వస్తువు రేటు.. తనకివ్వవలసిన కమీషన్ కూడా అతనే నిర్ణయిస్తాడు.

రూల్సన్నీ చెప్పాక ఒకరొకరుగా అతని ముందు ప్రవేశపెట్టబడుతున్నారు వారు.

"ఏరా నేను చెప్పినట్లు చేస్తావా? .." జుట్టు పట్టుకుని అడుగుతున్నాడు బాజీ రావు.

అవునన్న వాడి వివరాలు ఒక రిజిష్టర్లో రాసుకుని బయటకు పంపుతున్నారు.

కాదన్నవారికి మరి నాలుగు తగిలించి మరీ తను చెప్పదలచుకున్నది చెప్తున్నాడు- "చూడూ... నా మాట వింటే, మీరు చేసే దొంగతనాలకు నా ప్రొటెక్షన్ ఉంటుంది. ఇంకా అవసరమయితే ఎమ్మెల్యేగారి రక్షణ ఉంటుంది. అదే మీ ఇష్టప్రకారం దొంగత నాలు చేస్తే... నాకు దొరికిన వారిని దొరి కినట్లు ఎన్‌కౌంటర్ చేసిపారేస్తాను. అందులో ఇప్పుడు జనం కూడా మీలాంటి వారిని ఎన్‌కౌంటర్ చేసే పోలీసుల్ని హీరో లతో సమానంగా చూస్తున్నారు. కాకపోతే ఒకటిరోయ్... దొంగతనం అంటూ జరి గాక దొంగని పట్టుకోవాలి కదా! ఒకసారి కాకపోయినా మరొకసారి అయినా దొంగ దొరకాలి కదా! ఇప్పుడు నన్ను కాదని బయటకు పోదామనుకుంటున్నారే... వారినే అసలు దొంగతనాలకు బాధ్యులను చేసి జైల్లో కూర్చోబెడతాను. అలా పడి ఏడుస్తారో, నేను చెప్పిన మాట విని బాగు పడతారో... మీరే నిర్ణయించుకోండి..." అనర్గళంగా సాగిపోతున్న అతని మాటలు విన్నాక కాదనే ధైర్యం ఎవరూ చెయ్యలేదు.

★ ★ ★

గోడౌన్ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న చెట్టు కింద నిలబడి ఉన్నాడు పాండు.

అతను కాంతాన్ని ఒప్పించి వచ్చేటప్ప టికి ఈ సమయం అయింది.

ముందు అతన్ని పంపటానికి ఆమె ససేమిరా ఒప్పుకోలేదు. కానీ... వెళ్ళిన మనుషులు ఎంతకీ తిరిగి రాకపోవటంతో ఆమె మనసులో కూడా రకరకాల అనుమానాలు పొడచూపాయి.

అందుకే అతన్ని ఎటువంటి దుందుడుకు చర్యా చేయకుండా కేవలం తండ్రి ఆచూకీ కనుక్కుని రమ్మని పంపింది.

ఒకరొకరుగా బయటకు వస్తున్నారు వారి ఊరి వ్యక్తులు. రోడ్ యాక్సిడెంట్లో తీవ్రమయిన దెబ్బలు తిన్నట్లు తూలుకుంటూ నీరసంగా బయటకు వస్తున్నారు.

బయటకు వచ్చే ప్రతి వ్యక్తీ తన తండ్రేనేమో అని ఆత్రంగా చూస్తున్నాడు పాండు.

దాదాపుగా అందరూ బయటకు వచ్చినా రామకోటి మాత్రం రాలేదు. అతను లోపలే ఉన్నాడని అందరూ చెప్తున్నారు. అయినా... ఎవరి కోసం ఎవరూ ఆగే పరిస్థితుల్లో లేరు. ఎవరి దారిన వారు వెళ్ళిపోతున్నారు.

పొద్దుపోయే కొద్దీ దట్టమయిన చీకట్లు పరిసరాలను ఆక్రమించుకుంటున్నాయి. లోపల ఏదో జరుగుతుందన్న సూచనగా లైట్లు వెలుగుతున్నాయి. బాజీరావు ఉన్న గుర్తుగా జీపు బయట ఉంది.

నెమ్మదిగా కదిలిన పాండు చీకటిలోనే గోడౌన్ చుట్టూ తిరిగి దాని వెనుక పక్కకు చేరాడు.

వెనుక గోడకు సన్నటి వైపు ఒకటి

బిగించి ఉంది. గోడౌన్ పైన రేకుల కప్పు ఉంది. అక్కడక్కడా రేకులు విరిగిపోయి ఉన్నాయి. గోడా, రేకులూ కలిసే చోట మనిషి దూరే వీలున్న ఖాళీ ఉంది.

లోపల నుండి మనుషుల మాటలు లీలగా వినిపిస్తున్నాయి. ఏదో జరుగుతుంది... తన తండ్రి లోపలే ఉండిపోయాడు. తను ఆయనకు సహాయంచేసే పరిస్థితుల్లో లేకపోయినా... కనీసం ఏమి జరుగుతుందో తెలుసుకోకుండా ఇక్కడే నిలబడిపోవటం భావ్యంగా అనిపించలేదు.

తలెత్తి చూశాడు.

దాదాపు పదిహేను అడుగుల ఎత్తుతో నిట్టనిలువుగా నిలబడి ఉంది గోడౌన్ గోడ. సన్నని పైపు పట్టుకుని అంతెత్తు గోడ తను ఎక్కగలడా అన్న సందేహం కలిగింది అతనికి.

ఇంతలో ఎవరో బాధతో అరచిన అరుపు లోపల నుండి లీలగా వినిపించింది.

ఇంక ఆగలేకపోయాడు పాండు.

పైపు పట్టుకుని బరబరా పైకి పాకటం మొదలుపెట్టాడు. రెండు నిమిషాల తరువాత పైవరకూ చేరుకున్నాడు. గోడకూ, రేకుకూ మధ్య ఉన్న ఖాళీ ప్రదేశం నుండి శరీరాన్ని లాఘవంగా దూర్చి... చేతులు గోడ అంచుల మీద వేసి... తన శరీరాన్ని గోడ మీదకు లాక్కున్నాడు.

బల్లపరుపుగా గోడ మీద పడుకుని కింద జరిగేది చూడసాగాడు.

గోడౌన్ లోపల వెలుగుతున్న లైటులన్నీ కిందకు ఫోకస్ చేసి ఉండటంతో సీలింగ్ మీదకు వెలుతురు చేరటం లేదు. దానితో అతను ఎవరికైనా కనిపించే అవకాశం చాలా తక్కువ.

పైనుండి ఉయ్యాల లాగా వేలాడుతున్న సన్నటి లాఠీలాంటి కర్రను రామకోటి మోకాళ్ళకింద నుండి దూర్చి... అతన్ని తలక్రిందులుగా వేలాడదీశారు.

లాఠీలతో కొట్టటానికి అనువుగా అతను వేలాడుతున్న ఎత్తును ఎడ్జస్ట్ చేసుకుని, అతని అరికాళ్ళమీద ఇద్దరు పోలీసులు ఒకరి తరువాత ఒకరు కొడుతున్నారు.

అతని మూలుగులు బయటకు వినపడకుండా నోట్లో గుడ్డలు కుక్కి ఉన్నాయి.

ఇంతలో... ఇక చాలు అన్నట్లు బాజీరావు చేయి ఊపాడు.

పోలీసులు కొట్టటం ఆపారు.

"మనిషిని పనికి రాకుండా చేస్తారేమిటిరా? ... ఇతనితో మనకి చాలా అవసరం ఉంది..." అంటూ బాజీరావు నెమ్మదిగా నడుచుకుంటూ వేలాడుతున్న రామకోటి దగ్గరకు వచ్చి నోట్లో కుక్కిన గుడ్డలు బయటకు పీకాడు.

అప్పటి వరకూ అణచుకున్న బాధ మూలుగురూపంలో వెలువడింది.

పాండు మనసు రగిలిపోతుంది. కానీ... ఏమి చెయ్యాలో అర్థం కావటం లేదు.

"ఇప్పుడయినా ఒప్పుకుంటావా... నేను చెప్పిన పని చేస్తానని? " మార్దవంగా అడిగాడు బాజీరావు.

ఎండిపోయిన గొంతు నుండి బలవంతంగా మాటలు పెగల్చుకుని చెప్పాడు రామకోటి- "ఒప్పుకునే వాడినయితే... మొదట అడిగినప్పుడే ఒప్పుకునే వాడిని. ఇప్పుడు మీరు ఏదో నాలుగు దెబ్బలు కొట్టారు కదా అని ఒప్పుకుంటే... నేను రామకోటిని కాను సార్..."

బాజీరావు మొహం కోపంతో నల్లబడింది.

"ఏమి చూసుకునిరా ఇంత పొగరు? .... నీ నిజాయితీ ఏమి ఒరగపెట్టింది? తింటానికి కూడు ఇచ్చిందా? ఉండటానికి గూడు ఇచ్చిందా? ... నాతో